ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు వినతి



వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

లింగోజిగూడ: మన్సూరాబాద్ డివిజన్ పరిధి శ్రీకృష్ణనగర్‌లో విద్యుత్ సమస్యలు ఉన్నాయని వెంటనే నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని ఆదివారం కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. రెండు రోజుల్లో కాలనీలో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మురళీ యాదవ్, రాజుగౌడ్, హరీష్‌రెడ్డి, బ్రహ్మయ్య, లింగస్వామి, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



కార్పొరేటర్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

ఎల్‌బీనగర్: కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు.డివిజన్ పరిధిలోని శ్రీపురం ఫేజ్–1 కాలనీవాసులు ఆదివారం కాలనీ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో పద్మారెడ్డి, నారాయణరెడ్డి, రాంరెడ్డి, దామోదర్‌రావు, పాండురంగం, అరవింద్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సూర్యవర్ధన్‌రెడ్డి, బాలకృష్ణ ఉన్నారు.

పిచ్చుక గూళ్ల అందజేత



ఎల్‌బీనగర్: పిచ్చుకలు పర్యావరణానికి, మనకి మంచి నేస్తాలని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం లయన్స్ క్లబ్, జాగృతి అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో పిచుక గూళ్లు, నీళ్ల తొట్లను పంపిణీ చేశారు ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. జంతువుల సంరక్షణకు కృషి చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వెటర్నరీ అధికారి డాక్టర్ యాదగిరి, జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్, లయన్స్ క్లబ్ వనస్థలిపురం అధ్యక్షులు విట్టా దురయ్య పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు పేరును తొలగించవద్దు



సైదాబాద్: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగించవద్దని ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ కోరారు. ఆదివారం ఐఎస్‌సదన్‌లో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక కొత్త పథకాలు ప్రారంభిస్తున్నదని, వేరే ఏదైనా పథకానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టుకోవచ్చని అన్నారు. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చవద్దని కొద్ది రోజుల క్రితం 500 మంది ఆర్యవైశ్యులు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం కూడా ఇచ్చామని ముఖ్యమంత్రి తెలుగు విశ్వవిద్యాలయం పేరు మార్చే విషయంలో నిర్ణయాన్ని మార్చుకోవాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ హరిపురి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్ది శ్రీనివాసులు గుప్తా, ప్రధాన కార్యదర్శిగా నోముల మురళీ, కోశాధికారిగా ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా దుబ్బ అనిల్ కుమార్ గుప్తా, అల్వాల శ్రీధర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ మరం యాదిరెడ్డి, కల్చరల్ సెక్రటరీలుగా తాళ్లపల్లి వంశిగుప్తా, శ్రీనివాసరావు, లింగయ్య, జాయింట్ సెక్రెటరీలుగా యాదగిరి, సత్తిరెడ్డి, నెప్పల్లి శశిధర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెద్ది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రోడ్డు నంబర్–1లో ఉన్న వాటర్ డ్రైనేజీ సమస్యతో పాటు కాలనీలో వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

బస్సు ఎక్కాలంటే ఎన్ని కష్టాలో!

షెల్టర్లు లేక ఎండలోనే పడిగాపులు

ఉరుకుల పరుగులతో ప్రయాణికుల అవస్థలు | పట్టించుకోని అధికారులు



చంపాపేట చౌరస్తాలో బస్సులు ఆగే చోట షెల్టర్ లేకపోవడంతో రోడ్డుపై నిలబడ్డ ప్రయాణికులు

చంపాపేట: వేసవి ప్రారంభంలోనే ఎండల తీవ్రతతో ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం ఎనిమిది దాటితే ఇంటి నుంచి బయటకు రావాలంటే ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. అయితే బస్సులో ప్రయాణించే ప్రయాణికులకు ఆర్టీసీ, సర్కిల్ అధికారులు కల్పించే సౌకర్యాలు మాత్రం శూన్యం. చంపాపేట ప్రాంతంలో బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అసలే బస్సుల కొరత, మహిళలకు ఉచిత ప్రయాణంతో ఉన్న బస్సుల నిండా మహిళా ప్రయాణికులే. అత్యవసర పనుల కోసం ప్రయాణించేవారు మండే ఎండల వడగాల్పులలో ఇబ్బందులు పడాల్సిందే. అవసరమైన చోట బస్‌షెల్టర్లు లేవు. షెల్టర్‌ర్లు ఉన్నచోట బస్సులు ఆగక రహదారుల పక్కన, షాపింగ్ కాంప్లెక్స్ మాటున, చెట్ల కిందనే బస్సుల కోసం పడిగాపులు కాయాల్సి వస్తోంది.

ఉన్నషెల్టర్లు తొలగించడంతో

చంపాపేట మోడల్ మార్కెట్, కర్మన్‌ఘాట్ చౌరస్తాలలో గతంలో బస్‌షెల్టర్‌లు ఉండేవి వ్యాపార కేంద్రాలకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో తొలగించటంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడం లేదు. మీర్‌పేట, అల్మాస్‌గూడ, జిల్లెలగూడ, కటకోనికుంట, పోచమ్మగడ్డ వంటి పలుకాలనీవాసులు నెహ్రూనగర్ కాలనీ క్రాస్ రోడ్‌లోని డీఎంఆర్ఎల్ రోడ్‌లో రిక్వెస్ట్ బస్ స్టాప్‌కు నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఆ ప్రాంతంలో షెల్టర్ లేకపోవటంతో మండే ఎండలోనే ఎదురు చూడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

ఉరుకులు పరుగులతో..

బైరామల్‌గూడ, కర్మన్‌ఘాట్, చంపాపేట, వడ్డెరబస్తీ చౌరస్తా, సాయిరాంనగర్ ఆర్చి సమీపంలో షెల్టర్లు లేకపోవటంతో నడి రోడ్డుపైనే ప్రయాణికులు బస్సుల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ప్రయాణికులు నిల్చున్న ప్రాంతానికి సుమారు వంద, రెండు వందల మీటర్ల దూరంలో బస్సులు ఆగుతున్నాయని దీంతో ప్రయాణికుల ఉరుకులు పరుగులు, ట్రాఫిక్‌జాంతో రోడ్డు ప్రమాదాల వంటి సమస్యలు తలెత్తుతున్నాయని స్థానిక కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. గ్రీన్‌పార్క్ కాలనీఆర్చ్, చంపాపేట హరిజన శ్మశాన వాటిక, గాయిత్రీనగర్ చౌరస్తాల్లో బస్సు షెల్టర్లు ఉన్నప్పటికీ స్టాప్‌కు రెండు వైపులా అర కిలో మీటరు దూరంలో బస్సులు నిలుపుతుండటంతో ఉరుకులు, పరుగులతో బస్సెక్కాల్సి వస్తోంది.

షెల్టర్ ఉన్న చోట బస్సులు ఆగవు..

చంపాపేట చౌరస్తాకు నిత్యం చుట్టుపక్కల సుమారు 50 కాలనీల ఉద్యోగులు, విద్యార్థులు, నగరంలో ఇతర పనుల కోసం వేళ్లే ప్రయాణికులు చౌరస్తాలోని డీ–మార్ట్ ముందుకు బస్సు కోసం చేరుతుంటారు. ఆప్రాంతంలో షెల్టర్ లేకపోవటంతో మండే ఎండలోనే పడిగాపులు కాయాల్సివస్తుంది. తీరా బస్సుల వచ్చినా ప్రయాణికులు ఉన్న చోట ఆగకపోవటంతో ఇబ్బంది తలెత్తుతోంది. ఇది చాలదన్నట్లు చౌరస్తాలో వారాల తరబడి తరలింపునకు నోచుకోని మట్టిదిబ్బలతో మరికొన్ని ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ, ఆర్టీసీ సిబ్బంది సమన్వయంతో అవసరమైన చోట బస్టాప్‌లు ఏర్పాటుతో పాటు స్టాప్ పాయింట్లలోనే బస్సుల ఆపేలా చర్యలు చేపట్టాలని లేకుంటే రాస్తారోకో కార్యక్రమం చేపడుతామని ప్రయాణికులు, కాలనీవాసులు హెచ్చరిస్తున్నారు.



చంపాపేట చౌరస్తాలో ప్రయాణికులు నిలబడే చోట మట్టిదిబ్బలు

ఎండలో పడిగాపులు..



బస్సుల కోసం నిలబడేచోట స్టాపులు ఉండవు..ఉన్నా ఆ ప్రాంతంలో బస్సులు ఆగవు. స్టాప్‌కు చాలాదూరంలో నడిరోడ్డుపై బస్సులు ఆపుతున్నారు. ప్రయాణికులు ముందు వెనుక చూసుకోకుండా ఆందోళనతో ఉరుకులు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుంది. చంపాపేట ప్రాథమిక పాఠశాల, ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో బస్టాప్‌ను ఏర్పాటు చేసి నెల కాకముందే తొలగించారు. అదే ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలి.

– రాము, చంపాపేట

షెల్టర్ ఉన్న చోట బస్సు ఆపాలి



వేసవి దృష్ట్యా డీఎంఆర్ఎల్ చౌరస్తా నుంచి బైరామల్‌గూడ అలైఖ్య టవర్ వరకు రోడ్డుకు ఇరువైపులా కనీసం ఐదు బస్టాప్‌లు ఏర్పాటు చేయాలి. చంపాపేట హరిజన శ్మశాన వాటిక ముందు ఏర్పాటు చేసిన బస్టాప్‌కు ప్రయాణికులు రారు..వచ్చినా ఆప్రాంతంలో బస్సులు ఆపరు. ప్రజాధనం దుర్వినియోగం తప్ప ప్రయోజనం లేదు. ప్రయాణికులు వేచి ఉండే ప్రాంతంలో బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలి.

– యూటీ ఆనందనాయుడు, ప్రేమ్‌నగర్ కాలనీ

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న మధుయాష్కిగౌడ్

లింగోజిగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందిన వారికి ఎంతో మేలు చేస్తుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు.ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లకు చెందిన వారికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఆయన అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పటికి పేదల పక్షమేనని, వారి సంక్షేమనికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, మున్నా, సుధాకర్‌గౌడ్, పాల్గొన్నారు.

ఉషాకిరణ్‌కు మహిళా సాధికారత అవార్డు



చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌కు చెందిన నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ (ఎన్‌టీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సామాజిక, రాజకీయవేత్త ఉషాకిరణ్‌కు మహిళాసాధికారత–2025 అవార్డుకు ఎంపికైనట్లు యామినీ ఫౌండేషన్ చైర్మన్ యామినీ కనకతారక ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న రవీంద్రభారతిలో నిర్వహించనున్న కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి చేతుల మీదుగా అవార్డును ఉషాకిరణ్‌కు అందచేయనున్నట్లు తెలిపారు. ఉషాకిరణ్ గత పదేళ్లుగా వేలాది మంది మహిళా నిరుద్యోగులకు ఉచిత చేతివృత్తులు, కోచింగ్‌పై శిక్షణ ఇప్పించటంతో పాటు సామాజిక సంస్కృతిని పరిరక్షించటంలో ఆయన ఎనలేని కృషి చేశారని కనకతారక పేర్కొన్నారు.

శివారు కాలనీల్లో మెరుగైన వసతులు కల్పిస్తాం



రోడ్డుపై పారుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: నియోజకవర్గం శివార్లలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెరుగైన వసతులు కల్పిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ లోని కమర్షియల్ టాక్స్, ఖాదీబోర్డు, వాసవి, బ్లడ్‌బ్యాంక్ తదితర కాలనీల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అయా కాలనీలకు డ్రైనేజీ ఔట్‌లేట్లు లేకపోవడంతో మురుగు నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. మంచినీటి సరఫరా, విద్యుత స్తంభాలు, రోడ్లు లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జీఓ 118 గురించి ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ జీఓ కింద దరఖాస్తు చేసుకున్న వారికి కన్వినియన్స్ డీడ్‌లు ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుపడుతున్నారని బాధితులకు కన్వినిన్స్ డీడ్లు ఇప్పించేందుకు త్వరలోనే సీఎంను కలుస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట తిరుమల్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, మల్లేష్, మల్లీశ్వరిరెడ్డి, బాస్కర్‌సాగర్, జగన్‌మోహన్, పరమేష్, కృష్ణారెడ్డి ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

వనస్థలిపురం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం వనస్థలిపురం రైతుబజారు సమీపంలోని పార్కులో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చాలా మందికి రక్తదానం పట్ల అపోహలు ఉన్నాయని, నిర్భయంగా రక్తదానం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చేపూరి శంకర్, డా.శూలపాణి, శ్రీధర్‌గౌడ్ శివశంకర్, శ్రీనివాస్, సునీత, సుజాత, యోగిత, ఆంజనేయులు, కృష్ణ, వెంకటేష్ పాల్గొన్నారు.

సర్వేనెంబర్ 38 వాసులకు ఇళ్ల పట్టాలివ్వాలి



సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

నాగోలు: నాగోలు డివిజన్ పరిధి ఫతుల్లాగూడ సర్వేనెంబర్ 58 వాసులకు వెంటనే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్ట్) హయత్‌నగర్ సర్కిల్ కార్యదర్శి కీసర నర్సిరెడ్డి, సర్కిల్ కమిటీ సభ్యులు చెన్నారం మల్లేశం ప్రభుత్వాని డిమాండ్ చేశారు. సర్వేనెంబర్ 58లో ఆదివారం ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఈ కాలనీలో 20 ఏళ్లకు పైగా నివాసముంటున్న వారికి ఇళ్ల పట్టాలి ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలపై ఇప్పటికే అధికారులు, ప్రజాప్రతినిధులతో పలుమార్లు మొర పెట్టుకోవడంతో కొంత మందికి మాత్రమే పట్టాలిచ్చారని మిగిలిన 800 మంది ఇంత వరకు పట్టాలు రాలేదన్నారు. ఈ కార్యక్రమంలో గంధం మనోహర్, జింకల శివ, నరసమ్మ, అలివేలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



శ్రీనివాస్

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గుమ్మడివెల్లి గ్రామానికి చెందిన ఎలుగూరి శ్రీనివాస్(50) వైదేహినగర్‌లో ఉంటున్నాడు. శనివారం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి రాత్రైనా రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జగదీశ్‌రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలి



జగదీశ్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేస్తున్న నాయకులు

లింగోజిగూడ: అసెంబ్లిలో స్పీకర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి సభ్యత్వం రద్దు చేయాలని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్‌బీనగర్‌లో జగదీశ్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులకు కనీస సభ మర్యాదలు కూడా తెలియకపోవడం సిగ్గుచేటని, ప్రజలు ప్రతి ఒక్కటి గమనిస్తున్నారని అందుకే రాష్ట్రంలో ఓడించడంతో పాటు ఎంపీ ఎన్నికల్లో ఒక్క సీటును కూడా ఇవ్వలేదన్నారు. గతంలో ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఇప్పుడు దళిత స్పీకర్‌ను అవమానిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ పన్యాల జైపాల్‌రెడ్డి, ఎల్‌బీనగర్ ఎస్టీ సెల్ అధ్యక్షులు రమేష్ నాయక్, నాయకులు బుడ్డ సత్యనారాయణ, శశిధర్‌రెడ్డి, ఉప్పల శ్రావణ్ కుమార్ గుప్తా, చెరుకు చిరంజీవి, బొంగు వెంకటేష్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, రాజేశ్వరీ పాల్గొన్నారు.

రూ. 2 వేలు ఇచ్చి.. యాసిడ్ దాడి చేయించి

- అకౌంటెంట్‌పై దాడి కేసును ఛేదించిన పోలీసులు
- ఇద్దరు పూజారుల రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న పోలీస్ అధికారులు

సైదాబాద్: ఆలయంలో అకౌంటెంట్‌పై యాసిడ్ దాడి కేసు మిస్టరీని సైదాబాద్ పోలీసులు ఛేదించారు. వ్యక్తిగత కోపాన్ని పెంచుకున్న ఆలయ పూజారే తన స్నేహితుడైన మరో పూజారితో దాడి చేయించాడని పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ పాటిల్ కాంతిలాల్ సుభాష్ వివరాలు వెల్లడించారు. శ్రీభూలక్ష్మీమాత ఆలయంలో విధుల్లో ఉన్న అకౌంటెంట్ నర్సింగరావుపై గుర్తు తెలియని దుండగుడు యాసిడ్ దాడి చేయగా రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అకౌంటెంట్‌పై దాడి అనంతరం నిందితుడు అక్కడి నుంచి తన ద్విచక్ర వాహనంపై సైదాబాద్, మలక్‌పేట, చాదర్‌ఘాట్ మీదుగా మెహిదీపట్నం నుంచి షేక్‌పేటలోని అతని నివాసం వరకూ వెళ్లటాన్ని 400 సీసీ కెమెరాలను పరిశీలించి రాయ్‌కోడ్ హరిపుత్ర (31)గా గుర్తించారు. హరిపుత్ర స్వస్థలం మెదక్ జిల్లా సదాశివపేట్. ప్రస్తుతం షేక్‌పేటలోని ఒక ఆలయంలో పూజారిగా పనిచేస్తున్నాడు. పోలీసుల విచారణలో పెద్దతోట శ్రీభూలక్ష్మీ మాత ఆలయంలో ప్రసుత్తం పూజారిగా చేస్తున్న తన స్నేహితుడు అరిపాల రాజశేఖర్‌శర్మ (41) అడిగినందుకే దాడి చేసానని తెలిపాడు. వెంటనే ఆలయ పూజారి రాజశేఖర్‌శర్మను అదుపులోకి తీసుకొని విచారించగా ఆలయంలో తరచూ తనతో గొడవలు పడుతున్న అకౌంటెంట్ నర్సింగరావుకు కీడు చేయాలనే దాడి చేయించానని ఒప్పుకోవడంతో ఇరువురిని రిమాండ్‌కు తరలించామన్నారు. ఆలయంలో తనతో పలు విషయాల్లో గొడవలు పడుతున్న అకౌంటెంట్ నర్సింగరావుపై ఎలాగైనా కక్ష్య తీర్చుకోవాలి అనుకున్న పూజారి రాజశేఖర్‌శర్మ అందు కోసం షేక్‌పేటలోని తన స్నేహితుడైన మరో పూజారి హరిపుత్రను సహాయం కోరాడు. యాసిడ్ దాడి చేసేందుకు సుపారిగా రూ. 2 వేలు మాట్లాడుకున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: అందరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ సూచించారు. సత్యనగర్ జనప్రియా, మానస ఎంక్లేవ్, మోహన్ నగర్ జనప్రియ, స్నేహపురి కాలనీల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాలనీ, అపార్ట్‌మెంట్ వాసులు ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ పార్క్, ప్రజనివాస్ ఫేస్–1 లోనూ నూతన ఓపెన్ జిమ్‌లకు ప్రతిపాదనలు పెట్టామని త్వరలోనే అక్కడ కూడా ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కిషోర్, శ్రీనివాస్, భానుప్రసాద్, రామోహన్ రెడ్డి, పృథ్వీ, రాజేష్, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం

వనస్థలిపురం: జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో కాలనీల్లో ఏర్పాటు చేసే ఓపెన్ జిమ్‌లను సద్వినియోగం చేసుకోవాలని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ప్రశాంత్‌నగర్ కాలనీలోని పార్కులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బాలాజీనాథ్, కరుణాకర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, పద్మారెడ్డి, చంద్రశేఖర్, రత్నాకర్ పాల్గొన్నారు.

పేదల బియ్యం పక్కదారి!

అక్రమ రవాణాకు అడ్డాగా ఛావుణీ



ఇటీవల ఛావుణిలో పట్టుబడ్డ రేషన్ బియ్యం

చంచల్‌గూడ: పేదల బియ్యం పక్కదారి పడుతోంది. ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలుచేసి అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాలకు ఛావుణి డివిజన్ అడ్డాగా మారింది. గతంలో కూడా ఇక్కడి నుంచే ఇతర జిల్లాలకు భారీగా రేషన్‌బియ్యం రాత్రికి రాత్రే తరలిపోయేవి.

కొత్త పంథా..

కార్డుదారుల నుంచి చిల్లర వ్యాపారులు, బ్రోకర్లు కొనుగోలు చేసి గోదాముల్లో క్వింటాళ్ల కొద్ది నిల్వ ఉంచి గుట్టుచప్పుడు కాకుండా డీసీఎంలలో తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు సమాచారం ఉందా లేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. బియ్యం తరలింపుపై అధికారులకు సమాచారం అందినప్పుడు మాత్రమే హడావుడిగా తనిఖీలు చేసి ఆ తర్వాత అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని ఆయా ప్రాంతాల వాసులు ఆరోపిస్తున్నారు. గతంలో డీసీఎంలు, ఆటోల్లో తరలిస్తుడంటంతో పోలీసులు, సివిల్ సప్లై అధికారులకు పట్టుబడుతున్నారని కొత్త పంథా అవలంభిస్తున్నారు.ఎవరికీ అనుమానం రాకుండా ద్విచక్ర వాహనాలపై తరలిస్తున్నారు.

కొరవడిన నిఘా..

నిబంధనల ప్రకారం నూకలను పోలీసులు, విజిలెన్స్ అధికారులు సీజ్ చేయడానికి వీలులేదు. ఈ లొసుగులను తెలుసుకున్న అక్రమార్కులు నూకల అక్రమ రవాణాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రైస్ మిల్లులపై ప్రత్యేక నిఘా ఉంచి నూకలు ఆడించక ముందే రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. మాదన్నపేట పీఎస్‌లో పదులు సంఖ్యలో అక్రమ రేషన్ తరలింపు, నిల్వల కేసులు నమోదవుతున్నా అక్రమార్కులు మాత్రం తమ దందాలను ఆపడం లేదంటే వారి వెనుక పెద్ద హస్తం ఉన్నట్లు అనుమానాలకు తావిస్తోంది.

30 టన్నుల బియ్యం పట్టివేత

గోదాం, లారీ సీజ్, ఇద్దరి రిమాండ్



గోదాంలో నిల్వచేసిన బియ్యం

హయత్‌నగర్: రేషన్ బియ్యాన్ని తరలించేందుకు గోదాం వద్ద సిద్ధంగా ఉంచిన లారీని పోలీసులు పట్టుకుని సీజ్ చేసిన ఘటన హయత్‌నగర్ పోలీ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట–మునుగనూరు వెళ్లే దారిలో ఉన్న ఓ పాత గోదాం వద్ద (పీడీఎస్) రేషన్ బియ్యాన్ని తరలించేందుకు లారీలో నింపుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 30 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పక్కనే ఉన్న గోదాంలో నిల్వ ఉంచిన సుమారు 7 టన్నుల బియ్యాన్ని గుర్తించి గోదాంకు తాళం వేసి సీజ్ చేశారు. హయత్‌నగర్ అంబేద్కర్ కాలనీకి చెందిన కాట్రోతు తిరుపతి బియ్యాన్ని సేకరించి నిల్వ చేయగా పెద్దపల్లి సుల్తాన్‌బాగ్‌కు చెందిన డ్రైవర్ రేకుల శివకుమార్ బియ్యాన్ని తరలించేందుకు లారీని తీసుకొచ్చాడు. ఇరువురిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ నాగరాజుగౌడ్ తెలిపారు.

కేసులు నమోదు చేస్తున్నాం

పలుమార్లు దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. పదులు సంఖ్యలో క్రిమినల్ కేసులు పెడుతున్నా వారిలో మార్పు రావడం లేదు. పోలీసు శాఖ అక్రమార్కులపై పీడీయాక్టు నమోదు చేయాలి. రేషన్ అక్రమాలకు సంబంధించి ఫోన్ నెంబరు 9908201848పై నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. పెద్ద ఎత్తున అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ చేస్తే రహస్య ప్రదేశాలపై తమకు, లేదా పోలీసు శాఖకు సమాచారం ఇవ్వాలి.

– నర్సింగ్‌రావు, ఏసీఎస్ఓ